క్లుప్తంగా

వలంటీర్ల సేవలు అభినందనీయం



గుడివాడటౌన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వార్డు వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక బేతవోలు హైస్కూల్‌లో గురువారం 22 నుంచి 29 వార్డుల సచివాలయాలకు చెందిన వార్డు వలంటీర్లను సత్కరించారు. ప్రతి ఒక్కరూ వీరి సేవలను గుర్తించాలని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, గణపతి, రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్.నీలాకాంత్, మామిళ్ల ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి జీవీఎస్‌బీ ప్రభాకర్ డాక్టరేట్ డిగ్రీ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు గురువారం తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ, కాకినాడకు చెందిన డాక్టర్ నర్రా రవికుమార్, డాక్టర్ డి.లింగరాజు పర్యవేక్షణలో డెవలపింగ్ అల్యూమినియం డస్ట్ మెటల్ మెట్రిక్ కాంపోజిట్స్ బై సాలిడ్ టెస్ట్ మెథడ్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేయగా ఈ డిగ్రీ ప్రదానం చేసినట్లు ఆయన వివరించారు. డాక్టరేట్ సాధించిన ప్రభాకర్‌ను కళాశాల సెక్రటరీ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఇంగిలిపాకలంకను సందర్శించిన ఎంపీడీఓ



మండవల్లి: ఇంగిలిపాకలంక గ్రామాన్ని ఎంపీడీఓ బి.ఆనందబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. డిజిటల్ అసిస్టెంట్‌లకు ఏపీ సేవ సర్వీసెస్ మెరుగుపరచాల్సిందిగా సూచించారు. సచివాలయ ఉద్యోగులు అంతా రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

ఉపాధి పనుల ద్వారా అభివృద్ధి బాటలో గ్రామాలు



మండవల్లి: ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి బాటలో కొనసాగుతున్నాయని ఇన్‌చార్జి ఏపీఓ నల్లా నవీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెరికెగూడెం గ్రామంలో రూ.46 వేల అంచనా విలువతో పంట బోదె అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 27 మంది కూలీలు పనులు చేశారని, ఈ పనుల ద్వారా కూలీలకు ఉపాధి లభించటమే కాక, రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. పశువులకు తాగునీటి కొరత తీరుతుందని పేర్కొన్నారు.

పెడన మున్సిపల్ కమిషనర్‌గా మహేంద్ర

పెడన: పెడన మున్సిపల్ కమిషనర్‌గా బి.మహేంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. అంజయ్యను సీడీఎంఏ కార్యాలయంలో తదుపరి పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాలని పేర్కొంది. ప్రస్తుతం మహేంద్ర ఏలూరు కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఓఎస్‌ స్కేల్‌పై ఈయన పెడన పురపాలక సంఘానికి కమిషనర్‌గా రానున్నారు. ఈయన శుక్రవారం లేదా శనివారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. అంజయ్య 2020 అక్టోబర్ 12న పెడన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవలి కాలంలో అత్యధికంగా పనిచేసిన కమిషనర్‌గా అంజయ్య గుర్తింపు తెచ్చుకున్నారు.

● ఆ నాటి ఆ స్నేహమానంద గీతం!

ముదినేపల్లి జెడ్పీహైస్కూల్‌లో 1988-89 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం జరిగింది. జిల్లాతో పాటు పలు జిల్లాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడ్డ విద్యార్థులు దాదాపు పాతికేళ్ల తర్వాత తాము చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సైతం సమ్మేళనానికి ఆహ్వానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ కుటుంబ నేపథ్యాల గురించి ముచ్చటించుకున్నారు. స్థానిక స్పామ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ, బొర్రా సాయిరాజు, రంగరాజు, పాట్నూరి గాంధీ తదితరులు సమ్మేళనాన్ని పర్యవేక్షించారు. –ముదినేపల్లిరూరల్



ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాలను అవ్వా, తాతలు సద్వినియోగం చేసుకోవాలని చినపులిపాక సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ(రాము) సూచించారు. మండలంలోని చినపులిపాక గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం గురువారం జరిగింది. శిబిరాన్ని సర్పంచ్ శివరామకృష్ణ ప్రారంభించారు. అరవై ఏళ్ల వయస్సు నిండిన అవ్వా, తాతలకు కంటి వెలుగు పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించటంతోపాటు కళ్లజోళ్లను అందిస్తోందన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని రిఫర్ చేస్తామన్నారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ వృద్ధులకు కంటి పరీక్షలను నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ మురళీకృష్ణంరాజు, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు అరుణకుమారి, నాగమణి పాల్గొన్నారు.



చినపులిపాకలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న రాజేష్‌కుమార్, సర్పంచ్ శివరామకృష్ణ

పరిసరాల శుభ్రతతో మలేరియా దూరం

తోట్లవల్లూరు: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా వ్యాధికి దూరంగా ఉండవచ్చని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. మలేరియా మాసోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. ఇంటిపైన ఓవర్‌హెడ్ ట్యాంకులు, ప్లాస్టిక్ డ్రమ్ములు, ఎయిర్‌కూలర్లను తరచూ శుభ్రం చేస్తూ ఆరబెట్టాలన్నారు. ఇళ్లల్లో దోమతెరలు వినియోగించాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎంపీహెచ్‌ఈఓలు మాణిక్యం, శ్రీధర్, హెచ్ఎస్ అనిల్‌కుమార్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న, ఆరోగ్య సిబ్బంది

పలు సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

గుడివాడటౌన్: వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో పట్టణంలోని పలు ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్‌లో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 18వ రోజు మజ్జిగ పంపిణీ కొనసాగింది. కార్యక్రమంలో ఎస్.రంగారావు, ఎం.సత్యన్నారాయణ, జి.ప్రభాకరరావు, రెడ్డి సింహాచలం, పి.వెంకట్, వంగపండు బ్రహ్మాజీ, మూడెడ్ల ఉమ తదితరులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో 28వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగింది. చెక్కా చెన్నకేశవరావు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసవిక్లబ్ అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, కోశాధికారి ఎక్కలి మణిదీప్, ఉపాధ్యక్షుడు జి.మల్లికార్జునరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, మాటూరి రంగనాథ్, బొగ్గరపు తిరుపతయ్య, వి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న వెలమ సంఘ నాయకులు

విశ్వబ్రాహ్మణ సంఘ సేవలు అభినందనీయం

కైకలూరు: పేదలకు విశ్వబ్రాహ్మణ సంఘం అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ విద్యార్థులకు నోటు పుస్తకాలను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి స్థలాల కేటాయింపు, నామినేటెడ్ పదవుల్లోనూ విశ్వబ్రాహ్మణులకు నియోజకవర్గంలో అధిక ప్రాధాన్యం కల్పించామన్నారు. సంఘ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి రోజు వృద్ధ వితంతువులకు బియ్యం, పింఛను సంఘం తరపున అందిస్తున్నామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన నిర్మల ఎంటర్‌ప్రైజెస్ దుకాణదారులు పేదలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జంపన కొండరాజు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు గానుగుల రాజా, కర్రి మోజేష్‌కుమార్, దివిలి బ్రహ్మం, లక్కోజు సురేష్, తుపాకుల సుబ్బారావు, దేవరపల్లి శర్మ, వల్లూరు కాళీదాసు, మంతెన ప్రదీప్‌కుమార్, పెదప్రోలు పాండు, బొద్దు సత్యనారాయణ, టేకు కనకాచారి, దోనెపూడి సుధాకర్, లావేటి శివాజీ, మంకు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, సంఘ పెద్దలు

గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశం

మండవల్లి: మండవల్లి, ముదినేపల్లి మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు, మండవల్లి సహాయ వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి స్థానిక ఏడీఏ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. వీఏఏలు అందరూ వచ్చే ఖరీఫ్–2023 సీజన్‌కు ఆర్బీకేల ద్వారా రైతులకు అవగాహన కలిగించి అర్హులైన రైతులకు సబ్సిడీపై డ్రోన్స్ అందించాలని, తమ ఆర్బీకేలలో డిజిటల్ కియోస్కో అన్ని వేళలా ఆన్ చేసి ఉంచాలన్నారు. సబ్సిడీపై వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసరను రైతులకు సకాలంలో అందించాలని సూచించారు. అర్హులైన రైతులకు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన వైఎస్సార్ రైతు భరోసా నగదును రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద మండవల్లి మండలంలో 2,383 మంది లబ్ధిదారులకు రూ.1 కోటి 36 లక్షల 90 వేల 500 నగదు విడుదల అయినట్లు తెలిపారు. ముదినేపల్లి మండలంలో 6,358 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 67 లక్షల 53 వేలు నగదు విడుదల అయినట్లు ఏడీఏ వెంకటమణి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటమణి

జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభం

మొవ్వ: వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు తరగతులు మొదలయ్యాయి. వడగాలులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తొలిరోజు కళాశాలకు విద్యార్థులు నామమాత్రంగానే హాజరయ్యారు.

శ్రీ గంగానమ్మ తల్లి జీర్ణోద్ధారణ ప్రతిష్ఠ

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధారణ ప్రతిష్ఠ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖులు ప్రత్యేక హోమాలు, పుణ్య దంపతులతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. దంపతులు యోగశాల వద్ద ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవ విగ్రహాలకు నీళ్లు పోసి పూజలు చేశారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పెరిగిన భూముల విలువ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నగరంలోని ఆరు డివిజన్లు, రూరల్ ప్రాంతంలోని ఏడు గ్రామాల్లో భూముల విలువ గురువారం నుంచి పెరిగిందని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ రజిత తెలిపారు. నగరంలోని రిజిస్ట్రార్ వార్డులైన 7, 9, 11, 13, 14, 24 (నగరంలో 32 వార్డులు ఉన్న సమయంలో) వార్డులతో పాటు గూడూరు, చిట్టిగూడూరు, కోకనారాయణపాలెం, రామరాజుపాలెం, తరకటూరు, మల్లవోలు, రాయవరం గ్రామాల్లోని భూముల విలువ పెరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ ప్రాంతాల్లోని భూముల విలువ 30 శాతం పెరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో పెరిగిన విలువకు కక్షిదారులు స్టాంప్‌డ్యూటీ 7.5 శాతం చెల్లించాలన్నారు. గత రెండు రోజుల క్రితం సర్వర్ ఇబ్బందులు తలెత్తినా మే 31వ తేదీన సర్వర్ సక్రమంగా పనిచేయడంతో ఒకే రోజు 170 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేశామని వివరించారు.

ఒకేషనల్ టీచర్లుగా సంభోదించండి



కైకలూరు: పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్లను పార్ట్‌టైమ్ అని పిలవకుండా ఒకేషనల్ టీచర్లుగా సంభోదించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ఎన్ దేవేంద్రరావు కోరారు. ఏలూరు జిల్లాలో విలీనమైన కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ఇన్‌స్ట్రక్టర్లతో ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాధారణ జీతభత్యం కింద రూ.32,670 చెల్లించాలన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి అభ్యర్థన, పరస్పర, భార్యాభర్తల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా జీఎస్‌సీ బోస్, ఉపాధ్యక్షుడిగా జీఎస్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.చంటమ్మ, కోశాధికారిగా బి.రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలు మండలాల నుంచి ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా పనులకు శ్రీకారం

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం జనార్ధనపురం పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్ సర్వే పనులు గురువారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ పర్యవేక్షణలో సర్వే పనులను ప్రారంభించారు. నందివాడ, గుడివాడ రూరల్ మండలానికి చెందిన సుమారు 48 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు ప్రభుత్వం నూతనంగా 110 ఎకరాలలో నిర్మించనున్న మంచినీటి చెరువు పైప్‌లైన్ ఏర్పాటు సర్వే ప్రారంభమైనట్లు వివరించారు. ఇందుకు కావలసిన ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇక్కడ యూనిట్ నిర్మాణ భూమిపూజ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కొప్పుల జయరాజు, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి, గ్రామ సెక్రటరీ కె.రామ్మోహనరావు, అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.రవికుమార్, స్థానికులు కె.నారపరెడ్డి, నిర్మల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సర్వే పనులు ప్రారంభిస్తున్న సిబ్బంది

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థి దశలో గ్రంథాలయాల పాత్రపై అవగాహన కల్పిస్తున్న సుష్మాసరోజ, పర్వీన



గుడివాడలో శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయ శాస్త్రంలో సర్టిఫికెట్ కోర్స్‌లో ఉత్తీర్ణత సాధించిన బీఎల్ఐఎస్‌సీ విద్యార్థిని మాతంగి సుష్మాసరోజ అన్నారు. మండవల్లి శాఖా గ్రంథాలయంలో 25వ రోజు గురువారం గ్రంథాలయాధికారి షేక్ పర్వీనతో కలిసి గ్రంథాలయం ఉపయోగాలు, విద్యార్థి దశలో గ్రంథాలయాల పాత్రపై పిల్లలకు అవగాహన కల్పించారు. గ్రంథాలయానికి విచ్చేసి విజ్ఞానదాయక సమాచారం సేకరించడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షకు కావలసిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బేతపూడి కుసుమ, సంసోన్, నవదీపిక, హనుమ, నవనీత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు గురువారం కూడా కొనసాగాయి. ఈ శిక్షణలో భాగంగా జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం.మాధవరావు విద్యార్థులకు పాటలు నేర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు వంగిపురపు వీర రాఘవాచారి పద్యాలు నేర్పించారు. అనంతరం వీర రాఘవాచారి రచించిన నీతి పద్య రత్నావళి శతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు డీఆర్‌బీ ప్రసాదు, గ్రంథాలయ ఉద్యోగులు పి.శాంతి, వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో పలు ప్రయోజనాలు

ముదినేపల్లి రూరల్: ధ్యానంతో విద్యార్థులకు పలు రకాల ప్రయోజనాలున్నాయని పిరమిడ్ మహర్షి రవిచంద్ర అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ధ్యానానికి సంబంధించి రవిచంద్ర విద్యార్థులకు వివరించారు. ధ్యానంతో ఏకాగ్రత పెరిగి పాఠ్యాంశాలను సులభశైలిలో అర్థం చేసుకునేందుకు వీలుపడుతుందన్నారు. దీనివల్ల మానసిక ఉత్తేజం కలగడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా ధ్యానంపై శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు దీని ప్రాధాన్యతను వివరించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు బాబూరావు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం తమిరిశ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన కె.శిరీషకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎస్.అనుకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన అత్తిలి షైని కి రూ.2 వేలు నగదు బహుమతులు అందించారు. ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయిబాబు, సాయిరామ్, నాగేశ్వరరావు, రమేష్, పిచ్చేశ్వరరావు,శాంతరాజు,కిషోర్‌తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

రేపల్లెలో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

హాజరైన ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: గంగానమ్మ నూతన శిఖర, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వింజరం పంచాయతీ శివారు రేపల్లె గ్రామంలో ఉలిసి వంశస్థుల ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అమ్మవారి సంబరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, వింజరం సర్పంచ్ ధర్మరాజుల నాగమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చేబోయిన వీర్రాజు, గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు ధర్మరాజుల సూర్యనారాయణ, ఉలిసి శ్యామ్‌సుందర్, మీగడ సత్యనారాయణ, మాదపాటి చింతయ్య, బుర్ల పోతురాజు, మీగడ శ్రీనివాసరావు, కైకలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు పాల్గొన్నారు.



రేపల్లెలో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కనుల పండువగా శత కలశ క్షీరాభిషేకం

కోడూరు: భక్తుల హరి నామ స్మరణ మధ్య వెంకన్నకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి తిరువారాధన, హోమాలను నిర్వహించారు. కోడూరుకు చెందిన సింగం పవన్ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించగా, వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం వైభవంగా జరిపారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను కోడూరులోని ఇమ్మడి రాంబాబు ఇంటికి ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. కోడూరు, ఇస్మాయిల్‌బేగ్ పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం కౌతుకోత్సవం, రాత్రికి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.



కలశాలకు పూజలు చేస్తున్న పండితులు, ఉభయ దాతలు

● జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి నిర్మాణాల పరిశీలన



జగనన్న గ్రీన్ విలేజ్‌లో నూతన టెక్నాలజీతో అర్త సంస్థ నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను గురువారం ఎమ్మెల్యే డీఎన్నార్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ సురేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు. –కైకలూరు

12న అప్రెంటీస్ మేళా

గుడివాడటౌన్: ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు ఈనెల 12వ తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు బీకేఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తిచేసి అప్రెంటీస్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 93943 32229, 81436 53907ను సంప్రదించవలసిందిగా కోరారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడటౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సుల్లో చేరేవారి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీకేఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఈ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు 8, 10 తరగతులు పాసైన వారికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 08674–295953, 8555952320ను సంప్రదించవలసిందిగా కోరారు.